క్లుప్తంగా

ప్రతి పౌరుడూ మొక్కలు పెంచాలి



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, రోటరీ సభ్యులు

నిడదవోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించడాన్ని ఉద్యమంలా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటికో మొక్క అనే వినూత్న కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ళ రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి సాయిబాబు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి కలెక్టర్ రాక

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని మండల ప్రత్యేకాధికారి, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎస్‌టీజీ సత్యగోవింద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కె మాధవీలత, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హాజరవుతారని చెప్పారు.

వైఎస్సార్ సీపీ తాళ్లపూడి పట్టణ అధ్యక్షుడిగా మైగాపుల



పార్టీ తాళ్లపూడి పట్టణ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన మైగాపుల ఆంజనేయులు, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు తదితరులు

తాళ్లపూడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాళ్లపూడి పట్టణ శాఖ అధ్యక్షుడిగా మైగాపుల ఆంజనేయులు నియమితులయ్యారు. గురువారం తాళ్లపూడిలో ఆ పార్టీ నాయకుల సమావేశం పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఆంజనేయులు ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వల్లభొట్టి శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ గౌరవాధ్యక్షుడు సిద్ధంశెట్టి కృష్ణ, నాయకులు నక్కా చిట్టిబాబు, పోశిన శ్రీకృష్ణదేవరాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ

తాళ్లపూడి: మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా మండలంలోని మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 మందికి స్టీల్ ప్లేట్లను గురువారం అందజేశారు. ఈ పాఠశాల 1993 బ్యాచ్ విద్యార్థులు పెద్దేవం గ్రామానికి చెందిన తిగిరిపల్లి గోపి ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాసవికి అందజేశారు. కార్యక్రమంలో మేకల పట్టాభి రామారావు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఊనగట్ల విద్యార్థినులకు ఉపకార వేతనాలు

చాగల్లు: ప్రతిభావంతులైన విద్యార్థినులకు నగదు పురస్కారాలు అందించి కెనరా బ్యాంక్ ప్రోత్సహించింది. కెనరా విద్యాజ్యోతి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఊనగట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఈ వేడుక జరిగింది. పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తున్న ఈ పాఠశాల విద్యార్థినులకు రూ.22,500 నగదు ప్రతిభా ఉపకార వేతనాలు అందించారు. ఆ బ్యాంక్ నిడదవోలు శాఖ బ్రాంచ్ మేనేజర్ ఉపేంద్ర, మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్ చేతుల మీదుగా ఈ ఉపకార వేతనాలను విద్యార్థినులకు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌వీ రమణ, సిబ్బంది బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

తాళ్లపూడి: నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు గురువారం అందజేశారు. తన కుమారుడు పునీత్ పవన్ పుట్టిన రోజు సందర్భంగా తాళ్లపూడి ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ వాటిని అందజేసారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, రెండో ఎంఈవో సీహెచ్ నెహ్రూజీ, ఉపాధ్యాయులు సుభాషిణి, భరత్‌రాజా క్రాంతి కుమార్, కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కొవ్వూరు: రెండు వర్గాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టు పెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన మండలంలోని దొమ్మేరు గ్రామానికి చెందిన చిన్నం హరిబాబు అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. హరిబాబును అరెస్టు చేసి అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్టు గురువారం చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణానికి చెందిన వరిగేటి సుధాకర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

లేఅవుట్లలో వెలుస్తున్న జగనన్న లోగిళ్లు

- శరవేగంగా గృహ నిర్మాణాలు
- 143 లే అవుట్లలో 7,258 గృహాలు మంజూరు
- వివిధ దశల్లో పనులు



దేవరపల్లి మండలం సంగాయగూడెం జగనన్న కాలనీలో వేగంగా జరుగుతున్న గృహ నిర్మాణాలు

దేవరపల్లి: పేదోడి సొంతింటి కల నేరవేరుతోంది. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులే స్వయంగా నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున ఉచితంగా అందజేస్తోంది. దీనికి కొంత సొమ్ము వేసుకుని లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుంటున్నారు. కొత్త సంవత్సరంలో గృహప్రవేశాల చేయలనే పట్టుదలతో లబ్ధిదారులు పనులను వేగవంతం చేస్తున్నారు. ఏడాది క్రితం లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇచ్చి పట్టాలు పంపిణీ చేసింది. రెండో విడతలో 2022–23లో ప్రభుత్వం గృహాలు మంజూరు చేసింది. నాలుగు మండలాల్లో 143 లే అవుట్లు ఏర్పాటు చేసి, 7,258 మందికి పట్టాలు పంపిణీ చేశారు. సొంత స్థలాలు ఉన్న సుమారు 10 వేల మంది పేదలకు గృహాలను మంజూరు చేశారు. అవాస్ యోజనలో 3600 గృహాలు మంజూరు కాగా దాదాపు నిర్మాణాలు పూర్తిచేశారు. ఇవన్నీ పూర్తయితే నియోజకవర్గంలోని సుమారు 20 వేల మంది పేదలకు సొంతిల్లు సమకూరుతుంది. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో సతమతమవుతున్న పేదలకు సొంతిల్లు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేవరపల్లి మండలంలోని సంగాయగూడెం, త్యాజంపూడి, బందపురం గ్రామాల్లో, ద్వారకాతిరుమల మండలం ఎం. నాగులపల్లి, పి.కన్నాపురం గ్రామాల్లో గృహనిర్మాణాలు జరుగుతున్నాయి. సంగాయగూడెంలో 50 మంది లబ్ధిదారులు గృహనిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

దేవరపల్లిలో మోడల్ కాలనీ

దేవరపల్లిలో జగనన్న లే అవుట్‌లో మోడల్ కాలనీ నిర్మాణానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చర్యలు చేపట్టారు. దీనికోసం గుండుగొలను–కొవ్వూరు స్టేట్ హైవేను అనుకుని పోలవరం కుడి కాలువ సమీపంలో 40 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇప్పటికే 30 ఎకరాల్లో లేఅవుట్ వేసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. 90 రోజుల పథకంలో గుర్తించిన లబ్ధిదారుల కోసం మరో 10 ఎకరాలు సేకరించారు. కాలనీలో సుమారు 2000 మంది పేదలకు గృహనిర్మాణం జరుగుతోంది. గృహ నిర్మాణాలు పూర్తయితే ఇదొక పెద్ద ఊరవుతుంది. జగనన్న లే అవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. నీరు, రోడ్లు, విద్యుత్తు సదుపాయం కల్పిస్తున్నారు. బోర్లు వేసి మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంటు సదుపాయం కల్పిస్తున్నారు.

35 ఏళ్లుగా రోడ్డు పక్కనే ఉంటున్నాం



35 ఏళ్లుగా రోడ్డు పక్కనే గుడిసె వేసుకుని ఉంటున్నాం. అప్పటి నుంచి ఇంటి స్థలం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తునే ఉన్నాం. ఇచ్చిన పత్రాలు బుట్టదాఖలు చేశారు. సొంతింటిపై ఆశలు సన్నగిల్లాయి. గత ప్రభుత్వం పేదల గురించి పట్టించుకోలేదు. జగనన్న దయతో ఇన్నాళ్లకు సొంతిల్లు సమకూరుతోంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం జరుగుతోంది.
– అద్దేపల్లి రమణ, లబ్ధిదారు, సంగాయగూడెం

జగనన్నకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే 15 కుటుంబాలు 30 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్నాం. గుడిసెలు పీకడానికి గత ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేయగా అడ్డుకున్నాం. అప్పట్లో వైఎస్సార్ సీపీ నాయకులు మాకు అండగా నిలిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హామీ ఇచ్చారు. ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు.
– తమ్మినపూడి రత్నం, లబ్ధిదారు, సంగాయగూడెం

వేగంగా గృహ నిర్మాణాలు



నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. 143 లే అవుట్లలో 6,259 గృహాల మంజూరు కాగా, వివిధ దశలో నిర్మాణంలో ఉన్నాయి. పునాది వేసిన వెంటనే రూ.70 వేలు బిల్లు చెల్లిస్తున్నాం. లబ్ధిదారుని ఖాతాకు బిల్లులు జమ అవుతున్నాయి. నిధుల కొరత లేదు. వర్షాకాలం కావడం వల్ల పనులు కొంత ఆలస్యం అవుతున్నాయి. 5203 గృహాల నిర్మాణం జరుగుతున్నాయి.
– టి. శేఖర్‌బాబు, డీఈఈ, గృహనిర్మాణ శాఖ

ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం



నియోజకవర్గంలో ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేరుస్తాం. 20 వేల మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేశాం. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇల్లు కట్టుకోవాలి. అర్హత ఉన్న ప్రతి వాడికి పార్టీ, కుల, మతలాలకు అతీతంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నాం. కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్తు, మంచినీటి సదుపాయం కల్పిస్తున్నాం.
– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం



గజ్జరం జెడ్పీ హైస్కూల్ మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో



అండర్- 14 విభాగం కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థినులు

నల్లజర్ల: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగే ఈ పోటీలను ఎంఈఓ వై.సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. తొలి రోజైన గురువారం అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి దాదాపు 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో రోజు శుక్రవారం గేమ్స్ విభాగంలో ఎంపిక పోటీలు జరుగుతాయని మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పల్లి వెంకటఅప్పారావు తెలిపారు. గేమ్స్ విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగా, టెన్నికాయిట్ ఉంటాయన్నారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని అప్పారావు చెప్పారు. అండర్–14 విభాగానికి ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకూ, అండర్–17 విభాగానికి 6 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు.మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హులన్నారు.హైస్కూల్ హెచ్‌ఎం కోమలి చిత్ర, ఉపాధ్యాయురాలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను గురువారం గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఎంఈవో బాలామణి ఈ పోటీలను ప్రారంభించారు. అండర్- 14 విభాగంలో ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్ తదితర విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇక్కడ సత్తా చాటిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. అండర్- 17 విభాగంలో మండల స్థాయి ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహిస్తామని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ, వ్యాయామో పాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో రోగి వద్దకే వైద్యం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- యర్నగూడెంలో అవగాహన సదస్సు



ఫ్యామిలీ డాక్టర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గ్రామీణుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెట్టారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంపై మండలంలోని యాదవోలు పీహెచ్‌సీ పరిధిలోని యర్నగూడెం గ్రామ సచివాలయం వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి సదస్సులో మాట్లాడుతూ నెలలో రెండు సార్లు వైద్య బృందం ప్రతి గ్రామంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందిస్తారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. 105 రకాల మందులు, 14 రకాల మందులు 104 వాహనంలో అందుబాటులో ఉంటాయన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఫీవర్ సర్వే చేసి, జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం 104 వాహనాన్ని ఎమ్మెల్యే వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు పరిశీలించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు బొంతా చినబాబు, రత్నావతి, డాక్టర్ సీహెచ్ హరిచందన, ఉప సర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు, సీహెచ్‌ఓ ఎం.శిరీష పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్లు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో శంకుస్థాపన



దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మిస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షల వ్యయంతో దేవరపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో నిర్మించే సిమెంట్ రోడ్లకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.60 లక్షలు మంజూరయ్యాయన్నారు. తొలి విడతలో రూ.30 లక్షలతో నాలుగు సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రెండో విడతలో మిగిలిన రూ.30 లక్షల వ్యయంతో మిగిలిన రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. రోడ్ల నిర్మాణం పూర్తయ్యాక డ్రైనేజీల నిర్మాణం చేపడతామన్నారు. ఈ కాలనీ ఏర్పడి 22 ఏళ్లు అయినప్పటికీ ఇంత వరకూ అభివృద్ధి చెందలేదన్నారు. కాలనీ వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే తలారిని కోరారు. నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు మంజూరు చేస్తున్నట్టు సమావేశంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీపీ కేవీకే దుర్గారావు కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుగ్గిన గంగాధర్, మాధవరపు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ వెలగా సాంబశివరావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తీరిగూడెంలో గడపగడపకూ..



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. పట్టణంలోని 23వ వార్డు తీరిగూడెంలో గురువారం గడపగడపకూ మనప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సంక్షేమ సారథి జగనన్నను ఆశీర్వాదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, ఆ వార్డు కౌన్సిలర్ మద్దిపాటి నాగశ్రీ , కొత్తపల్లి సుప్రియ, ఎస్‌కే వజీరురుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు, ఎస్‌కే చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ముకుందా.. మురారీ

సంప్రదాయబద్ధంగా కృష్ణాష్టమి వేడుకలు

నిడదవోలు: కృష్ణాష్టమి వేడుకలను గురువారం స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత మదనగోపాలస్వామి వారి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, మహిళా భక్తులచే భగవదీ పారాయణ జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదాలు పొందారు. ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, బిర్రె పార్వతి, దాకే అనిల్‌కుమార్, అర్చకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

నిడదవోలు రూరల్: తాడిమళ్ల గ్రామంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి, సింగవరంలోని చిన రామాలయం వద్ద శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మురళీ కృష్ణ స్వామివారి ఆలయంలో కృష్ణాష్టమి పూజలు నిర్వహించారు. వేద పండితులు పొన్నా కృష్ణబాబు, నర్సమాంబ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తాడిమళ్లలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీ రాజగోపాలస్వామి వారు

చాగల్లు: మండలంలోని దారవరం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద, నందింగపాడు, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చాగల్లులోని పలు పాఠశాలల్లోను, ఆలయాల వద్ద గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

శ్రీవారి క్షేత్రంలో గో పూజలు

ద్వారకాతిరుమల: స్థానిక చిన వెంకన్న క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం నేత్ర పర్వంగా జరిగాయి. కొండపైన గోసం రక్షణశాలలో పురోహితుల వేద మంత్రోచ్చరణల నడుమ ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, పలువురు సిబ్బంది, భక్తులు గోవులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వాటికి దాణా అందించారు. అలాగే గోశాల వద్ద సప్త గోకులంలో కొలువైన శ్రీకృష్ణుడిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పురోహితులు కృష్ణునికి పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



నిడదవోలులో మదన గోపాలస్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



ద్వారకాతిరుమల శ్రీవారి గోసంరక్షణ శాలలో గోమాతకు పూజలు చేస్తున్న ఏఈఓ నటరాజారావు తదితరులు

నేడు క్షేత్రంలో ఉట్లు పండుగ..

శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు ఉట్లు పండగను జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్లు పండుగను వైభవంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అందులో భాగంగా ఉభయ దేవేరులతో శ్రీవారు క్షేత్ర పురవీదుల్లో ఊరేగుతారన్నారు.

శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

నల్లజర్ల: దూబచర్ల గ్రామంలోని శ్రీశైల భ్రమరాంబిక, మల్లికార్జున స్వామివారి ఆలయం రూ.30 లక్షల వ్యయంతో పలు విగ్రహాలను ఆధునీకరించారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. జంగారెడ్డిగూడెంకు చెందిన వేద పండితుడు వెంపర్ల మురళి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రతిష్ఠ నిర్వహించారు. తొమ్మండ్రు రవి, ఆయన సోదరుడు విజయ్ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. శివలింగంతో పాటు అమ్మవారు, వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీను, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి పంది సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు చేబ్రోలు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన జరిగింది.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవనానికి శంకుస్థాపన

ఉండ్రాజవరం: మోర్త పంచాయతీ పరిధిలో నిర్మించే బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణానికి గురువారం ఆ యూనియన్ అధ్యక్షుడు వీరవల్లి వెంకట సుబ్బారావు, లక్ష్మి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణానికి మోర్త పంచాయతీ ఆరు సెంట్ల స్థలాన్ని కేటాయించింది. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్‌లో 250 మంది సభ్యులు ఉన్నారు. భవన నిర్మాణానికి కూడా తోడ్పాటు అందిస్తామని పంచాయతీ సర్పంచ్ చిటికెన సుజని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. స్థలాన్ని కేటాయించినందుకు సొసైటీ చైర్మన్ ఆలపాటి నరేంద్ర, సర్పంచ్ చిటికెన సుజని, వైస్ సర్పంచ్ దాపర్తి సందీప్‌తో పాటు వార్డు సభ్యులకు యూనియన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ తణుకు నాయకులు కామన మునిస్వామి, తూరుగోపు వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ నిమ్మన శ్రీనివాసు, వైస్ ప్రెసిడెంట్ ఉచ్చింతల ఉప్పాలాచారి, కార్యదర్శి ప్రకాష్, సంయుక్త కార్యదర్శి షేక్ వలీ, కోశాధికారి హనుమంతరావు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

దేవరపల్లి: బలహీన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పలు బీసీ కుల సంఘాల ప్రతినిధులతో గురువారం సాయంత్రం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి సమావేశమయ్యారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కులాల వారీగా వారిని అడిగి తెలుసుకున్నారు. బీసీలకు అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో బీసీలు మోసపోయారని తలారి గుర్తు చేశారు. గీత కార్మిక సంఘం ప్రతినిధి తంగెళ్ల మునిస్వామి మాట్లాడుతూ గీత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, నీరా కేఫ్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. పలువురు బీసీ సంఘాల ప్రతినిధులు తమ పలు సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కడలి హైమావతి, యాదవోలు సర్పంచ్ ఎస్.వరప్రసాద్, పలువురు బీసీ సంఘాల ప్రతినిధులుపాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం



కొల్లి శైలజ

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్నుకు చెందిన విద్యార్థిని అదృశ్యమైంది. స్థానిక ఎస్సై కె.రామారావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన కొల్లి శైలజ మోర్త ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 1న మోర్తలోని ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆ విద్యార్థిని సాయంత్రం స్కూల్ వదిలిన తర్వాత ఇంటికి రాలేదు. ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సీఐ సెల్ నంబర్ 94407 96659, ఎస్సై 94407 96643 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.